# బహుమాన మెవరిది?

శ్రీ వంటెత్తు

దృశ్యం :—యమునిదర్బారు. [యముడూ, చిత్రగుప్తుడూ, తదితరమంత్రులూ, ఉచితాసీనులై వుంటారు.]

యము:—(చిత్రగుప్తునివైపు సాధికారంగా చూస్తూ) చిత్రగుప్తా! హంతకప్రముఖబహుమాన వృత్తాంతమెల్లెడల చాటించావా?

చిత్ర:—(పొడుంకాయ రొంటినిదోపుకుంటూ పైకిలేచి) చిత్తం. చిత్తం.

యము :—ఎవరెవరు వచ్చారు?

చిత్ర: — ఇద్దరు పాశ్చాత్యులూ, ఒక ప్రాచ్యుడున్నూ.

యము:—కాలహరణమెందుకు? కార్యకలాపం మొదలుపెట్టు?

చిత్ర :—(సాభిప్రాయంగా సభనుచూస్తూ) ఓ హంతకకళానిపుణలారా! ప్రయాసయనక మాసభకు విచ్చేసిన మీకు, మా కార్యవర్గం తరపున కృతజ్ఞతను తెలియజేసి, చెప్పేదేమంటే —ప్రకటన పూర్వకంగా, మా ఆశయాన్ని యిదివరకే మీకు తెలియజేశాం. ఇప్పటివరకూ, మీలో హంతకశ్రేష్ఠులెవరో మాకు తెలియదు. ఈ దిక్కుమాలిన తుప్పలచాటుఖాంఖ



యుద్ధకారణాన, మా చిత్రాలుకూడా అసంపూర్ణంగానే వ్రాయబడ్డాయి. మీమీ యర్హతలీమహాసభలో రుజువు చేసికొని మాచే ప్రకటింపబడిన ప్రకారం, పది కోట్ల సువర్ణదేవ నాణెములనూ బహుమానం పొందండి. (అనికూర్చొనును.) (సభ కొంతసేపు సద్దుమణగివుండును. ఒక వయసు మీరిన పాశ్చాత్యుడు, బోడి గుండును చేతితో నిమురుకుంటూలేచి, యమునివైపు తిరిగి—)

"ధర్మప్రభూ! నేను ఇటలీనియంతను. నాపేరు 'సీనార్ ముసోలినీ' అంటారు. హత్యలన్న నాకత్యంతప్రియం. నేను నియంతనగుటకుముందు, నారాజకీయ విరోధులనేకులు నాగూఢచారులచే ప్రచ్ఛన్నంగా చంపబడ్డారు. నేను అధికారంలోకిరాగానే, అన్నెమూ, పున్నెమూ యెరుగని 'అబ్సీనియను' ల కాలనేళ్లరాశాను. శస్త్రాస్త్ర ప్రయోగమెరుగని 'అబిసీనియను'ల దారుణాయుధాగ్నికిబలిజేసి, ప్రపంచ యమదేవాంశసంభూతులకు వీనుల విందుజేశాను. హిట్లర్' ఐరోపారాజ్యాల, కైవశం జేసికొంటూ, ఫ్రాన్సులో అడుగుపెట్టగానే, అప్పటికి ఫ్రాన్సుకూ. నాకూగల'నిరాక్రమణపుటొడంబడిక' నుతుత్తునియలుజేసి, జర్మనులతోపోరుచూ, వెన్నుచూపుచుండిన, ఆఫరాసు సేనావాహినులపైబడి నాప్రతాపం జూపించి, విశ్వాస ఘాతకపట్టాన్ని శాశ్వతంగా పొందాను. ఆదినుండియు, ప్రచ్ఛన్నహత్యాకాండకు మూలపురుషుడనైన నేను మీకు సరియైన జాబితా నీయజాల. మహామంత్రులు చిత్రగుప్తులవారి చిఠాలు తిరగవేస్తే సరియయినలెక్కలు తేలవచ్చు. కాబట్టి—ఓ ధర్మదేవా! పాక్షిక రహితులగు మీరు నాకీ బహుమానం నాయోగ్యతలు విచారించి నాకిప్పించగలందులకు ప్రార్థిస్తూ విరమిస్తూన్నాను. (అని తన ఆసనంలో కూర్చొనును.)

(హిట్లర్ పటోటాపంగా పైకిలేచి)

"ధర్మదేవా! నేను జర్మనీదేశపు నిరంకుశనియంతను నన్ను అడాల్ఫ్ హిట్లర్ అంటారు. మానవలోకభయంకర వీరుడనగు నన్ను తెలియనివారీరేడుజగానలేరు. ఈ ముసలితొక్కు 'సీనార్ ముసోలినీ' నా సముఖాన తన ప్రతాపాన్ని చెప్పడం సాహసమే! నా ప్రతాపం ముందు వీని ప్రతాపం, దినిటీముందు దీపములాంటిది. జక్కుల' నుక్కడచి, 'పోలెండ్' పోడిమి బుగ్గిజేసి. 'హాలెండు' నాహాకారముల పాల్జేసి, 'నార్వేను' నక్కలకావాసంజేసి, 'డెన్మార్క్'

ఎకలించి, 'బెల్జియం'ను పీనుగులపెంటజేసి, ఫ్రాన్సు పని ...శాపం, అవక్ర విక్రమం. నావేరువిన్న చంటిపిల్లచన్ను ముట్టదు. రాజాధిరాజు భోజనంచేయడు, "స్టాలిన్‌గ్రాడ్" రుధిర సంద్రము మత్కృతహత్యాకాండకు ప్రబలనిదర్శనం. మధ్యధరా సముద్రాన్ని మానవరక్తపు మడుగుజేశాను. నా శత్రు నౌకాబలాన్ని 'అట్లాంటిక్' మహా సముద్రానికి బలిచ్చి నిశ్శబ్దసమాధిని జేశాను' దేవరయంశతోబుట్టితినని నన్ను కవులు పొగడుతారు. గాయకులు పాడుతారు. భూలోకమందుగల అబాలగోపాలమూ, ఏదోవిధంగా నన్ను సంస్మరిస్తూనేవుంటారు. నాకీర్తిని చతుర్దశ భువనాలకూ వ్యాపింపజేసి, నా హత్యాకాండకు తోడ్పడిన నా సహచరులు, రిబ్బన్‌ట్రాప్, గోరింగ్, గోబెల్స్, హెస్, పాపన్, రోమెల్, రుండ్‌స్టెడ్, కేటల్ మున్నగు హంతకప్రముఖులు, నిజంగా 'యెనిమిది' దిక్కులూ పరిపాలించగల సమర్థులు. స్త్రీబాలవృద్ధ తారతమ్యం, హత్యలు జేసేటప్పుడు నాతో సహా వీరికూడాలేదు, "రెక్కబాంబు"లూ, 'రాకెట్‌బాంబు'లూ, దివ్యలు సైతం యెదురోకజాలని ధారుణమారణాయుధాలు. వాటివాతబడి లక్షోపలక్షలు దేవరయాస్థానానికేతెంచారు. ప్రత్యేకంగా "రష్యన్" వీరులే, రెండు కోట్లకు పైబడి, మా ఆయుధాలకు 'బలి' ఐనారు. 'లిబియా' యుద్ధంలో నిహతుల సంఖ్య లెక్కింపరానిది. 'క్రీటు' యుద్ధంలో, మా 'పారాషూట్' దళాలు చూపిన సాహసం, నిరుపమానం. 'సిసిలీ,' 'ఫాంటలేరియా,' 'కార్సికా,' దీవుల్లో మా జలాంతర్గాములు చూపిన శౌర్యం అప్రతిహతం. రోగులనూ, అంగవిహీనుల్నీ, తీసికొని పోవు ఓడలెన్నెని వీటివల్ల ముంచబడి, చరిత్రలో ప్రముఖస్థానాన్నాక్రమింప గలిగాయి. వేయేల ? నేడుకూడా 'జర్మనీ' నుండి వేలాదివేలు, దేవరయాస్థానానికి, కాటకం మూలంగా వస్తూన్నారంటే, నా మూలాన్నేకదా:—కాబట్టి ఓ ధర్మప్రభూ! నిష్పాక్షికంగా దేవర 'కాబినెట్'తో సంప్రదించి, బహుమాన నిర్ణయంచేయండి. నాకీ బహుమానం రానిచో, మీరు మారణాశయాన్నే కించపరచినట్లవుతుంది. తరువాత దేవరచిత్తం (అని తీవిగా కూర్చొనును.)

(కాఫీహోటళ్ల ప్రతినిధిలేచి, యమునుద్దేశించి)

"ధర్మదేవా! నా వుపన్యాసం, సాంతంగా విన్నాక దేవరకు నాయందుగల అపోహ తప్పకుండా పోతుంది. నాది భారతదేశం. కాఫీహోటల్ సంఘంవారు నన్ను తమ ప్రతినిధిగా నియమించడం వల్ల నే నిక్కడకు వచ్చాను. భూలోకంలో, హిట్లర్, ముసలోలీలవల్ల చంపబడినవారి సంఖ్య పరిమితము. కాని—మా సంఘం వారిచే చంపబడినవారిసంఖ్య అపరిమితము. పాత చిఠాలన్నీ ఒకసారి దేవర చిత్తగిస్తే, విషయం సుబోధక మవుతుంది. మాకాఫీ కప్పునకు వేయి ఆటంబాంబులైనా సరితూగలేవు. క్షయ, కుష్టు మొదలగు నానాజాడ్యాలవారూ, మా ఆలయాన్ని అనుదినం క్రమం తప్పక సందర్శించి, ఉచ్ఛిష్టభేదాన్ని పాటించక. ఒకే "కప్"లో కాఫీపానం చేస్తారు. విశ్వమానవ కళ్యాణ కారణమైన వర్ణ, వర్గ, రాహిత్యం మా కాఫీ "కప్"తోనే ప్రారంభమయింది భూలోకంలో, రాజ్యాన్నేలెడి మహారాజు మొదలు, దొడ్డి బాగుజేయు పాకీ పోలిగానివరకూ, ఒకేపాత్రలో కాఫీ పానంచేస్తారు. మా పాత్రయొక్క అంచులువిడిచి, అడుగునే కొంచం నీళ్లతో తొలుస్తాం. అందువలన అంటురోగక్రిములు నశించవు. అక్షయమవుతూనే వుంటాయి. ఇంక రోగాలు రేగకుండా వుండడానికి అవకాశమేదీ ? కొంతకాలానికి పిడుగులాంటివాడు పీనుగ అవుతాడు. ఎలాంటి వీరుడైనా నిర్వీర్యుడై, శల్యావశిష్టుడై, దేవరయాస్థానాని కేతెంచడానికి రోజులెక్కపెడుతూంటాడు. వాని సంతానంకూడా నిర్వీర్యమైపోతుంది. ఈ రీతిగా మా కాఫీ 'కప్'లోని రోగవాహకక్రిములు, ఒక మనిషినే గాక ఒక వంశాన్ని తరతరాలవరకూ దుస్సరరోగాల్లోముంచి, అల్పాయుష్కులను చేస్తుంది. అకాలమరణానికి హేతుభూతమైన మా కాఫీ 'కప్' యొక్క దివ్యచరిత్ర సర్వలోక సంస్తవనీయం. కాఫీపానం చెయ్యనిదే, సాఫీగా కవులు కావ్యాలల్లలేరు. కాఫీపానం చెయ్యనిదే కంఠమెత్తిపాడరు గాయకులు. కాఫీపానం చేయ్యనిదే కుంచెలు ముంచరు చిత్రకారులు రంగుల్లో. కాఫీపానం చెయ్యనిదే, కాముకులు కాముకక్రీడల తేలియాడరు. ఇంతయై, అంతయై, సర్వాంతర్యామి అయిన, మా కాఫీ "కప్" చరిత్ర యీనాటిదా ? కాదుకాదు. అనాది ప్రసిద్ధము. 'కొలంబస్'కన్నా ముందు, మా హోటల్ ప్రతినిధి అమెరికాలో "కాఫీ కప్"ను ప్రతిష్ఠజేశాడని చరిత్ర చెబుతూంది. మెక్సికో భూగర్భ పరిశోధనమందు, బుద్ధవిగ్రహాలున్న చోటున 'కాఫీకప్' లు కూడా దొరికాయని ఇటీవలి పరిశోధకులు వెల్లడించారు. ఈజిప్ట్‌దేశమందు మూడవ 'పిరమిడ్' నిర్మాతయగు "నైటోక్రిస్" మహారాణి, తనభర్తను హత్యజేసిన శత్రువులమీది పగతీర్చుకోడానికి వారి దేశాల్లో కాఫీ ఆలయాలు తన పంచమదళం వారిచే స్థాపింపజేసి అరిశేషమశేషం జేసిందని చరిత్ర చెబుతూన్నది. మా హోటళ్ల ఆర్గనైజరు — అయఃపిండప్రధాని. కల్లుపాకలూడబెరికి కాఫీపాకల్ని వాటిస్థానే కట్టిస్తూన్నాడు. మా సంస్థ భారతదేశాన కోటిపడగలతో ప్రళయనృత్యం జేస్తూంది ఈ

విధంగా, దేవర మారణాశయాన్నే పరమానధిగానెంచి, హత్యా కార్యాకలాపాన్ని నిర్విఘ్నంగా, భూలోకమెల్లెడ సాగిస్తూన్నాం. కోటానుకోట్ల నిర్భాగ్యులు మా 'కాఫీకప్' కారణాన దేవరయాస్థానానికి వచ్చారు. వస్తూన్నారు, వస్తారు. కాబట్టి—ఓ ధర్మదేవా! ఈ బహుమానాన్ని మాకే యిప్పించండి. (అని కూర్చొనును.)

(హిట్లర్ మసులోనీలు దీనంగా ఒకరినొకరు చూచుకొంటారు.)

యముడు:—(చిత్రగుప్తునివైపుచూచి) చిత్రగుప్తా! బహుమానమెవరిది ?

చిత్ర:—దేవా! హంతక కార్యక్రమానికి, దేవరధర్మకర్తలుగదా! మీరే అంతిమ నిర్ణయాన్ని చేయండి.

యముః—(సభవైపు తిరిగి) హంతక కళానిపుణులారా! మీమీ ఆ

తలు మాకు పూర్తిగా తెలిశాయి. హిట్లర్ మసుల్ హంతకులు మాత్రమే—వారు హంతకశ్రేష్ఠులుకారు. 'కాఫీకంపెనీ' వారు హంతక శ్రేష్ఠులనుట నిర్వివాదాంశము. నేడు ఈ బహుమానాన్ని 'కాఫీ కంపెనీ' వారి కీయనిచో, మామారణాయం కుంటుపడగలదు. ఇప్పటికే కార్యభారంచే కృంగిపోతూన్న మేము, క్రొత్త పనులు కల్పించుకోజాలము. కాబట్టి "కాఫీ కంపెనీ" వారికే మేమీ బహుమానమీయడానికి నిర్ణయించాం (అని కూర్చొనును.) (సభ్యులందరూ కరతాళధ్వనులు చేయుదురు, తెరవ్రాలును )

# యుద్ధానంతరం

మేరు సోమయాజుల
వరహాలు

ఫాసిజమ్మే హంతవ్యం
బాల్షివిజమ్మే క్షంతవ్యం
ఇంపీరియలిజమే యిలదివ్యం
చచ్చినవారల కోకవ్యం
బ్రతికున్నందులకే హవ్యం
అర్చనవిధాన మపసవ్యం
అయిన ఖర్చులకె మనద్రవ్యం
బానిసత్వమే బహుభావ్యం

అస్వతంత్ర మది అనివార్యం
ప్రజాపీడనమె ఔదార్యం
చావకుండుటకె మనధైర్యం
వివాదాలకే మనశౌర్యం
సలాముచేయుటకే స్థయిర్యం
మందభాగ్యమే మాధుర్యం
ప్రభుత్వానికే కైంకర్యం
భక్తిభజించుటే మనకార్యం

ఉప్పుడుబియ్యమె కడుభోగ్యం
మూడు చటాకులె ఆరోగ్యం
స్టాండర్డుగుడ్డే బహుయోగ్యం
సారీ ధోతీ మనభాగ్యం
మంచేమహాకోపలమృగ్యం
దేశ పరిశ్రమ దౌర్భాగ్యం
భారతీయులకే వైరాగ్యం
ఆంగ్లేయులకు మనఅర్ఘ్యం

ఇది యుద్ధానంతర కర్తవ్యం. ఇది యుద్ధానంతర సౌకర్యం ఇది యుద్ధానంతర సౌభాగ్యం

కార్డుకథ

## దసరాదణ్ణం

కథలు వ్రాయడం ఒక వంతు....వాటి కోసం పాత బంట్రోతులా పోస్టు ఆఫీసుకి తిరగడం పరిపాటయి పోయింది.—"కాగితం కరువురోజుల్లో ఇల్లాంటి పిచ్చపనులేమిటి....సంఘానికి సేవచెయ్యాలికాని, ఇల్లాటి ద్రోహాలేమిటి" అని స్నేహితుల చేత చివాట్లు కూడా తినవలసివచ్చింది.

మా వూళ్ళో లైబ్రరీ లేకపోవడంచేత వ్రాసిన కథకు పోస్టు ప్యూనే ఆధారం. క్రొత్త వూహాలతో కథ వ్రాసిపంపేను. కథపడుతుందని కల కూడా కన్నాను, పత్రిక వచ్చేవేళకి వూళ్ళో లేకపోవలసివచ్చింది. వెళ్ళినవూళ్ళో పత్రిక చూడడానికికూడా వీలులేకపోయింది. వుగ్గపట్టుకొని ఇంటికి వచ్చేను, పత్రిక వచ్చిందా అని నేను అడగకముందే ... పోస్టు ప్యూను మీకోసం తిరుగుతున్నాడు. ఒక్కసారి కనపడమన్నాడని" తమ్ముడు చెప్పగానే సంతోషం ఆపుకోలేక....చేతిలో రూపాయి పెట్టేను. పత్రికలో ప్రచురణం అవ్వడం అప్పుడే మనియార్డరు కూడా వచ్చిందని వలవన్నేను వళ్లుమరచి.

గుమ్మం దిగగానే నామాలుపెట్టుకొని నవ్వుకుంటూ పోస్టు ప్యూను వచ్చేడు. మనియార్డరుమీద సంతకం పెడదామని పెన్ను కోసం జేబులో చెయ్యిపెట్టగానే చేతులు నొక్కుకోడం మొదలెట్టేను నవ్వుకుంటూ. ఆ నవ్వును చూడగానే సంతోషంకలిగి "దబ్బున తియ్యవై మనియార్డరు....మళ్ళీ నేను వూరు వెళ్లాలి. నాకోసం చాలా రోజుల నుట్టి తిరుగుతున్నావుట....

చూసేవా! పత్రిక రాకముందే మనియార్డరు వచ్చింది....కథ చాలా బాగుందిలే ....ముందు మనియార్డరు తియ్యి" అక గొప్ప లెక్చరిచ్చేను. మనియార్డరుకాదు .... దసరా మామూలన్నాడు" దణ్ణం పెడుతూ మెల్లిగా !!

—"గళం"